ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

నిజామాబాద్

జిల్లా వార్తలు

5

సోమవారం 10 నవంబరు 2025


నగరంలో మహా పథ సంచాలన్ దృశ్యం


• ఎమ్మెల్యే ధన్‌పాల్



విద్యార్థి సంఘాలు మౌనం వీడేనా?

- టీయూలో అక్రమాలపై నోరు మెదపని విద్యార్థి సంఘాలు
- స్వప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్న నాయకులు
- యూనివర్సిటీ పరువుపోతున్నా తమకేమీ ఎరగనట్టు వ్యవహారం

తెలంగాణ యూనివర్సిటీలో 2012లో చేపట్టిన నియామకాలు చెల్లవని ఇటీవలే హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వారం రోజులుగా యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాలపై విద్యార్థి సంఘాలు స్పందించడం లేదు. ఒకప్పుడు చిన్న సమస్యకే ఉద్యమాలు చేసిన చరిత్ర కలిగిన విద్యార్థి సంఘాలు నేడు యూనివర్సిటీలో అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగంపై ఎందుకు మౌనంగా ఉంటున్నారనే ప్రశ్న ప్రతి ఒక్కరిలో కలుగుతోంది. స్వప్రయోజనాల కోసమే పనిచేస్తామే తప్ప.. యూనివర్సిటీ పరువుపోతే మాకేంటి అనేవిధంగా విద్యార్థి సంఘాల తీరు కనిపిస్తోంది.

నిజామాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో గతంలో నిజామాబాద్ జిల్లాతో పాటు కామారెడ్డి, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని ఉన్నత విద్యాసంస్థలు ఉండేవి. విద్యార్థుల ఉద్యమాల వల్ల 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటైంది. అనేక వివాదాలు, ఉద్యమాలకు కేంద్రబిందువుగా ఉన్న తెలంగాణ యూనివర్సిటీలో ఇటీవల జరుగుతున్న పరిణామాలపై విద్యార్థి సంఘాల మౌనం సమాజానికి నష్టం చేకూర్చేవిధంగా ఉండడం విద్యావేత్తలను ఆలోచింపచేస్తోంది. తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల నాయకులే తమ మనుగడను కాపాడుకున్నారు. ఉద్యమాల పేరుతో స్వప్రయోజనాలే లక్ష్యంగా కొంతమంది విద్యార్థి సంఘాల నాయకుల వ్యవహార శైలీ అనేక ఆరోపణలకు కారణమైంది. ఉద్యమాలు చేయడం స్వప్రయోజనాలు పొందడం పరమావధిగా కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు పనిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. యూనివర్సిటీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు యూనివర్సిటీని అంటిపెట్టుకుని కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు పబ్బం గడుపుతున్నారు. అక్కడే చదివి అక్కడే దొడ్డిదారిలో ఉద్యోగాలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకుల చరిత్ర గురించి యూనివర్సిటీలో ఏ చెట్టును అడిగిన ఏ పుట్టను అడిగిన చెబుతాయని విమర్శలు ఉన్నాయి. యూనివర్సిటీలో సమస్యను ఎత్తుకోవడం ఆ సమస్యను వారే పరిష్కరించి స్వప్రయోజనాలు

మిగతా 8వ పేజీలో...

టీయూలో అక్రమ నియామకాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

8

- బాధ్యులైన అధికారులను తక్షణం విధుల నుంచి తప్పించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలి
- ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్



హిందూ సమాజ ఏకీకృతంలో.. ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర కీలకం


• బస్వా లక్ష్మీనర్సయ్య

- ప్రతి హిందువు స్వయం సేవకుడిగా మారాలి
- దేశ రక్షణలో తమవంతు బాధ్యతను నిర్వర్తించాలి
- ఇందూరు విభాగ్ ప్రచారక్ శివకుమార్
- ఘనంగా సంఘ శతాబ్ది పథ సంచాలన్

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హిందూ సమాజాన్ని ఏకీకృతం చేయడంలో రాష్ట్రీయ స్వయం సేవక్ కీలక పాత్ర వహించిందని ఇందూరు విభాగ్ ప్రచారక్ శివకుమార్ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ ఇందూరు నగర మహా పథ సంచాలన్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. రాష్ట్రీయ స్వయం సేవక్ వంద సంవత్సరాల ప్రయాణంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంటూ ముందుకు సాగిందన్నారు. ప్రతి హిందువు స్వయం సేవకుడిగా మారి దేశ రక్షణలో తమవంతు బాధ్యతగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని శివకుమార్ అన్నారు.

ఇందూరు నగర శాఖ ఆధ్వర్యంలో..

రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని గౌతంనగర్‌లో ఇందూరు నగర శాఖ ఆధ్వర్యంలో మహా పథ సంచాలన్ కార్యక్రమం నిర్వహించారు. గౌతంనగర్ హెచ్‌పీఎస్ నుంచి ప్రారంభమై ఫిష్ బిల్డింగ్, ఆంజనేయస్వామి ఆలయం, నీలకంఠేశ్వర ఆలయం, శ్రీచాతాద్ధ వైష్ణవ సంఘం, రైతు బజార్ మీదుగా చంద్రశేఖర్ కాలనీ వరకు సాగింది. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ దండ సహిత గణవేష్‌తో హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా సంఘ్ చాలకులు కాపర్తి గురుచరణ్, విభాగ్ సహకార్యవాహ శ్రీనివాస్, నగర కార్యవాహ అరుగుల సత్యం, సుమిత్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కమ్మ కులస్థుల సేవలు అభినందనీయం

- కమ్మలు అన్ని రంగాల్లో రాణించాలి
- మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర రావు





మాట్లాడుతున్న మండవ వెంకటేశ్వర రావు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

బోధన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోధన్‌లో కమ్మ కులస్థులు చేపడుతున్న సామాజిక సేవలు అభినందనీయమని మాజీమంత్రి మండవ వెంకటేశ్వర రావు అన్నారు. ఆదివారం బోధన్ పట్టణ శివారులోని కమ్మ సంఘంలో 9వ కార్తీక వన భోజన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండవ వెంకటేశ్వర రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్మ కులస్థులు రాజకీయం, ఆర్థికంగా అన్ని రంగాలల్లో రాణించాలన్నారు. నాడు పంట పొలాల్లో బంగారం పండించిన కమ్మ కులస్థులు నేడు విద్య, వైద్య, సాంకేతిక అనేక రంగాలలో రాణిస్తున్నారని కొనియాడారు. కమ్మ కులస్థులలో పేద కుటుంబాలు ఉన్నాయని, వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. పేద విద్యార్థుల చదువుల కోసం బోధన్ కమ్మ సంఘం ఆధ్వర్యంలో కాకతీయ చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులకు ప్రశ్నలతో కూడిన చదువులు కాదు విలువలతో కూడిన చదువులు ముఖ్యమని పేర్కొన్నారు. కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం, వన భోజనాలు నిర్వహించడం వల్ల ఒకరినొకరు కలుసుకోవడంతో పాటు యోగా క్షేమాలు తెలుసుకోవడంతో రానున్న రోజుల్లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని, సామాజిక సేవలో ముందంజలో ఉండాలని అన్నారు. కార్తీక మాస వన భోజనాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు సామాజిక, సాంస్కృతిక ఉపన్యాసకురాలు భారతీయం సత్యవాణి, ప్రత్యేక ఆహ్వానితులు మండవ నళిని, టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అట్లూరి రమాదేవి, కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ, ప్రోగ్రామ్ చైర్మన్ పావులూరి వెంకటేశ్వర్ రావు, కో చైర్మన్ ఎం.శ్రీనివాస్ రావు, కార్యదర్శి గంగవరపు ఆదినారాయణ, ట్రెజరర్ చెలసాని శ్రీకాంత్‌లతో రంగారావు, శ్రీధర్, హరినాథ్ బాబు, మండవ కోటేశ్వర్ రావు, రవిలతోపాటు కమ్మ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానకు దారేది..?

- లోలం పల్లె దవాఖాన చుట్టూ ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- అధ్వానంగా ఆసుపత్రి నిర్వహణ
- పట్టించుకోని అధికారులు

8


దవాఖాన చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

వెలుగులు పంచుతారా..?

- అంధకారంలో ఎడపల్లి
- అస్తవ్యస్తంగా సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ
- అవస్థలు పడుతున్న ప్రజలు
- రాత్రి వేళ రోడ్లపైనే పశువులు
- తరచూ ప్రమాదాలు

6



తూకం వేశారు.. తరలింపు మరిచారు


తూకం వేసిన మొక్కజొన్న కుప్పలపై కప్పిన టాటిపత్రులు

- మొక్కజొన్న తరలింపులో నిండా నిర్లక్ష్యం
- పేరుకుపోతున్న మొక్కజొన్న కుప్పలు
- లారీలు అందుబాటులో లేవంటున్న అధికారులు
- ఆందోళనలో రైతులు


పేరుకుపోయిన మొక్కజొన్న కుప్పలు

జక్రాన్‌పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండంలోని పలు ప్రాంతాల్లో రైతుల నుంచి మొక్క జొన్నను కొనుగోలు చేసి న అధికారులు వాటిని తరలించడంలో జాప్యం చేస్తున్నారు. లారీ లు అందుబాటులో లేకపో వడంతో తూకం వేసిన మొక్క జొన్న సంచులు, మొక్కజొన్న కుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. మండలంలోని బ్రాహ్మన్‌పల్లి, కొలిప్యాక్, అర్గుల్, మునిపల్లి సొసైటీల పరిధిలో మొక్కజొన్న పంటను తూకం వేయగా లారీలు లేక తూకం వేసిన మొక్కజొన్న సంచులతో పాటు మొక్కజొన్న కుప్పలు సొసైటీల పరిధిలో ఎక్కడికక్కడ పేరుకుపోయాయని రైతులు వాపోతున్నారు. అయితే సకాలంలో లారీలు రాకపోవడంతో మొక్కజొన్న తరలింపులో జాప్యం జరుగుతోందని సొసైటీల పరిధిలోని సీఈవోలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సరిపడా లారీలను తెప్పించి తూకం వేసిన మొక్కజొన్న సంచులను వెంటనే తరలించాలని రైతులు కోరుతున్నారు.



సాగు సందడి

- మొదలైన యాసంగి సాగు పనులు
- నాట్ల కోసం నారుమళ్లు సిద్ధం
- వరి వైపే రైతుల చూపు
- ఉమ్మడి కోటగిరి మండలంలో 30వేలకి పైగా ఎకరాల్లో సాగు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- ఆరుతడి పంటలకు ఆదరణ కరువు
- నిజాంసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు

కోటగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగు తుది దశకు రావడంతో అన్నదాతలు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ అధికారులు సైతం సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసి సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచారు. సాగునీటి వనరులు పుష్కలంగా ఉండడంతో రైతులు వరి సాగుకే మొగ్గుచూపుతున్నారు. నాట్ల కోసం నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే బోధన్ డివిజన్‌లోని పలు మండలాల్లో రైతులు వరినారు మళ్లను సిద్ధం చేశారు. ఉమ్మడి కోటగిరి మండలంలో సుమారు 30వేల ఎకరాలలో వరినాట్లు వేయనున్నారు. పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, శనగ సుమారు 500ఎకరాలలో సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. వానాకాలం పంటలు అధిక వర్షాలతో తీవ్రంగా దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. యాసంగిలలోనైన దిగుబడి వస్తుందనే ఆశతో రైతులు ఉన్నారు.

సాగునీరు.. పుష్కలం

వర్షాలు సమృద్ధిగా కురవడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉంది. మంజీర నది సుమారు మూడు నెలల పాటు ప్రవహించడంతో భూగర్భజలాలు సైతం పెరిగాయి. వానాకాలం కంటే యాసంగిలో దిగుబడులు ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుంది. రైతులు బోరు బావుల వద్ద నారుమళ్లను తయారు చేసుకుంటున్నారు డిసెంబరులోపు వరినాట్లు పూర్తి చేసుకుంటే మార్చి చివరి వరకు పంటలకు చేతికి వచ్చే అవకాశం ఉంటుంది. ఏప్రిల్, మేలో వడగండ్లు కురిసే అవకాశాలు ఉంటాయన్న ఉద్దేశంతో రైతులు ముందస్తుగా సాగుకు సన్నద్ధమవుతున్నారు.

తగ్గిన ఆరుతడి పంటల సాగు..

ఉమ్మడి కోటగిరి మండలంలో గతంలో ఆరుతడి పంటల విస్తీర్ణం ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం సాగునీరు పుష్కలంగా

మిగతా 8వ పేజీలో...



సుదర్శన్‌రెడ్డిని కలిసిన

ధర్మపురి సంజయ్

- మున్నూరు కాపు సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానం

8

రాష్ట్రస్థాయి పోటీల్లో

నిజామాబాద్ జయకేతనం

8

ధాన్యాన్ని వెంటనే కొనాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి

8

అమరవీరుల స్ఫూర్తితో

ఉద్యమాలు కొనసాగిద్దాం

- న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి

క్రైం సమాచారం

చెరువులో పడి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్‌లోని చెరువులో పడి డిచ్‌పల్లి మండలం నడిపల్లికి చెందిన చిట్ల ప్రభాకర్ (50) మృతిచెందినట్లు ఎస్సై జి.మహేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నడిపల్లికి చెందిన చిట్ల ప్రభాకర్ శనివారం సాయంత్రం బైక్‌పై అర్గుల్ పల్ చెరువుకు వచ్చి చెరువులో గాలం వేసి చేపలు పడుతుండగా.. గాలానికి చిక్కిన చేపను తీయబోయి చెరువు నీటిలో మునిగి మృతిచెందారు. తెలిపారు. ఆదివారం ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య విజయలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య విజయలక్ష్మీ, కుమారుడు ఉన్నాడని పేర్కొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

కామారెడ్డి రూరల్, నవంబరు 09 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని ఇల్చిపూర్‌లో ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్చిపూర్‌కు చెందిన ప్యాట్ల ప్రమిల(53) అనారోగ్య కారణంతో కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతుందని పేర్కొన్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం తెల్లవారుజామున చెట్టుకు ఉరేసుకున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.



బుస్సాపూర్ వద్ద బోల్తా పడ్డ ట్యాంకర్

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

మెండోర , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుస్సాపూర్ 44వ జాతీయ రహదారిపై ఇథనాల్ ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇథనాల్ ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఆయిల్ ట్యాంకర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో మంటలు ఎగసి పడకుండా జాతీయ రహదారి సిబ్బంది, పోలీసులు అప్రమత్తమై ఎటువంటి ప్రమాదం జరగకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు. ఘటనాస్థలానికి ఫైర్ ఇంజన్ చేరుకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

తాడ్వాయి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతాయిపేట్ - చిట్యాల రోడ్డు మధ్యలో ఆటో బోల్తా పడి పలువురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. శుభకార్యం నిమిత్తం ఆటోలో 12 మంది ప్రయాణికులు వెళ్తుండగా.. అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌కు ఫోన్ చేసి క్షతగాత్రులను కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోతంగల్ మంజీర నది నుంచి రుద్రూరు వైపు వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఎస్‌ఐ సాయన్న పట్టుకుని రుద్రూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెండోర: మండల కేంద్రంలో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. పోలీస్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఉదయం మండల కేంద్రంలో ముప్కాల్ గ్రామానికి చెందిన ప్రవీణ్ ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఎడపల్లి: మండలంలోని దూపల్లి గేటు వద్ద ఆదివారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో గస్తీలో ఉన్న పోలీసులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాలీ ఆటోలను పట్టుకున్నారు. బోధన్ వైపు నుంచి నిజామాబాద్ వైపు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఈ ఆటోలను పట్టుకుని ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం చిన్న ఆటోలపై కేసు పెట్టే అధికారం తమకు లేదని, ఈ సమాచారాన్ని సోమవారం మైనింగ్ అధికారులకు తెలుపనున్నట్లు ఎస్సై రమ తెలిపారు.

బాన్సువాడటౌన్: మండలంలోని కొల్లూర్ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో శ్రీధర్ తెలిపారు. ఆదివారం బీర్కూర్ చౌరస్తాలో ఉదయం టిప్పర్‌ను తనిఖీ చేయగా అనుమతులు లేకుండా మొరం రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. టిప్పర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 09(ఆంధ్రజ్యోతి): పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని బ్రహ్మణపల్లి శివారులో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.12,510 నగదు, 4 మొబైల్ ఫోన్లు, 3 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడా పేకాట ఆడిన తమకు సమాచారం ఇవ్వాలని, తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై పేర్కొన్నారు.



ఎడపల్లిలో వెలగని సెంట్రల్ లైటింగ్

- అంధకారంలో ఎడపల్లి
- అస్తవ్యస్తంగా సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ
- అవస్థలు పడుతున్న ప్రజలు
- రాత్రి రోడ్లపైనే పశువులు.. తరచూ ప్రమాదాలు

వెలుగులు పంచుతారా..?

ఎడపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేకాధికారుల పాలనలో పల్లెల్లో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఎన్నో అభివృద్ధి పనులకు నిధులను ఖర్చు చేస్తున్న అధికార యంత్రాంగం ఎడపల్లి మండల కేంద్రంలోని సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అధికారులు కూడా కన్నెత్తి కూడా చూడటం లేదని ప్రజలు మండిపడుతున్నారు. దీంతో రాత్రయితే చాలు మండలకేంద్రం అంధకారంలోకి వెళ్లిపోతోంది. సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను మెరుగుపర్చి రహదారుల వెంట అంధకారాన్ని పారద్రోలి వెలుగులను నింపాలని ఎడపల్లి గ్రామ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రూర్బన్ పథకంలో ఏర్పాటు..

రూర్బన్ పథకంలో భాగంగా మండల కేంద్రంలోని శివాలయం నుంచి సాయినగర్ కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతోపాటు పలు ప్రధాన కూడళ్ల వద్ద హైమాస్ లైట్లను ఏర్పాటు చేశారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రధాన పోస్టాఫీసు వరకు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ వాటినిర్వాహణను మాత్రం గాలికి వదిలేశారు. గాంధీ పార్కు ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ మరి అధ్వానంగా మారింది. సెంట్రల్ లైటింగ్ సక్రమంగా లేక విద్యుత్ దీపాలు వెలుగక వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.

నిధుల కొరత ఉంది - నాగరాజు గౌడ్, పంచాయతీ కార్యదర్శి, ఎడపల్లి

రెండేళ్లుగా పంచాయతీలకు నిధులు రావడం లేదు. ఉన్న వాటితోనే గ్రామంలో పారిశుధ్యం, గ్రామ వీధుల్లో విద్యుత్, తాగునీటిపై ఖర్చు చేస్తున్నాం. సెంట్రల్ లైటింగ్ మరమ్మత్తులు చేపట్టాలంటే అధిక నిధులు అవసరం. పంచాయతీలో అంత నిధులు లేక మరమ్మతులు చేపట్టలేదు. నిధులు సమకూరగానే సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు చేపడతాం.

రోడ్లపైనే మూగజీవాలు.. తరచూ ప్రమాదాలు

మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రోజూ మూగజీవాలు సంచరించడంతోపాటు, రాత్రయితే రోడ్లపైనే నిద్రిస్తున్నాయి. సెంట్రల్ లైటింగ్ పనిచేయకపోవడంతో వాహనదారులు పశువులను ఢీకొంటున్నారు. పశువులు సైతం వాహనాల పైకి దూసుకెళ్తున్నాయి. మూగజీవాలు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుంటామని అనేకమార్లు చెప్పినా, ఇప్పటి వరకు అలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది.



ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తున్న మహేష్

ఎస్సైగా మహేష్ బాధ్యతలు

జక్రాన్‌పల్లి , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి ఎస్సైగా జి.మహేష్ ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. నిజామాబాద్ క్రైం బ్రాంచ్‌లో విధులు నిర్వహించిన ఆయన ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన మాలిక్ రహ్మాన్ సెలవుపై వెళ్లారని పోలీసులు తెలిపారు.

నేడు దోంచందలో జాతర

ఏర్గట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోంచందలో సోమవారం శ్రీ లక్ష్మీనారాయణ స్వామివారి జాతరను నిర్వహిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం వాసుదేవ పుణ్యాహవచనం, మండప ఆరాధన, స్వామివారి కల్యాణం, మండప స్థాపిత దేవతాహోమం, సత్యనారాయణ స్వామివ్రతం పురోహితులు తిరునగరి కృష్ణ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



ప్రాణధార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

'ప్రాణధార' పుస్తక ఆవిష్కరణ

మోర్తాడ్ , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మోరా వెంకటేశ్వర, శివాలయంలో డాక్టర్ అంబల్ల జనార్దన్ వజ్రోత్సవ అభినందన సమావేశాన్ని నిర్వహించారు. నేటి నిజం దినపత్రిక సంపాదకుడు బైస దేవదాసు సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జనార్దన్ రచించిన ప్రాణధార కథల పుస్తకాన్ని, వజ్రోత్సవ అభినందన సంచికలను బైస దేవదాసు, ఆచార్య టి.గౌరీశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్దన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఆహ్వానితులు బైస దేవదాసు, ఆచార్య గౌరిశంకర్, ప్రముఖ రచయితలు చంద్రశేఖర్ ఆజాద్, ఎంజీ రామిరెడ్డి, వ్యాఖ్యాత వీపీ చందన్‌రావు, రఘుశ్రీ ప్రసంగించారు. జనార్దన్ కవి, రచయితనే కాకుండా సామాజిక సేవకుడని కొనియాడారు. ఆయన ఇంగ్లిష్, తెలుగు, గుజరాతి, మరాఠీ భాషలలో ప్రావీణ్యం గల కవి అని, ఆయన నవలలు, కథలు ఇతర భాషల్లో అనువాదం చేశారని, మహారాష్ట్రలోని విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయని వివరించారు. సమావేశంలో పాల్గొన్న రచయితలు, కవులకు జనార్దన్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంబల్ల శ్రీనివాస్, విఠోబా, జనార్దన్ మిత్రులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కొడిచర్లలో ఐకేపీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

తరుగు పేరిట దోపిడీ సరికాదు

కోటగిరి,నవంబరు9(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించగా మిల్లర్లు తరుగు పేరిట కొర్రీలు పెడుతున్నారంటూ రైతులు మండిపడుతున్నారు. పోతంగల్ మండలంలోని కొడిచర్లలో ఆదివారం ఐకేపీ సిబ్బందిని రైతులు నిలదీశారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఇటీవల ధాన్యం కొనుగోలు చేశారని, ఒక్కో బస్తా 41.500కిలోలతో కాంటా చేసిన ధాన్యాన్ని సంబంధిత రైస్‌మిల్లులకు అన్‌లోడింగ్‌కు తరలించగా.. తక్కువగా రావడం ఏంటని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన ఓ రైతు 85బస్తాల ధాన్యాన్ని విక్రయించగా.. రైస్‌మిల్లులో అన్‌లోడ్ చేయగా ట్రక్ షీట్‌లో 80బస్తాలు మాత్రమే రాశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రైతుకు ఐదు బస్తాల చొప్పున తరుగు తీస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు వాపోయారు. బస్తాలకు అనుగుణంగా హమాలీ కూలీ చెల్లించామని, తక్కువ బస్తాలు ఎలా రాస్తారని సిబ్బందిని ప్రశ్నించారు. ఈ విషయమై ఐకేపీ సిబ్బంది నాగలక్ష్మి రైస్‌మిల్లర్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో రైతులు శాంతించారు. మరోమారు ఇలాంటి తప్పులు జరిగితే సహించేది లేదని రైతులు స్పష్టంచేశారు. అధికారులు ఇలాంటి సమస్యలు రాకుండా చూడాలని పేర్కొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీడీ వర్కర్స్ యూనియన్ నేతలు

బీడీ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

వేల్పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశాయి బ్రదర్స్ లిమిటెడ్ కంపెనీ బీడీ కార్మికులను నిలువు దోపిడీ చేస్తుందని, పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకొని బీడీ కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా నేత అరవింద్ డిమాండ్ చేశారు. ఆదివారం వేల్పూర్, సాహెబ్‌పేట్‌లో దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తలపెట్టిన కార్యక్రమ వాల్‌పోస్టర్లను బీడీ కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. యాజమాన్యం కార్మికులకు, చట్టానికి విరుద్ధంగా పది రూపాయలు తక్కువ ఇవ్వడం సరైంది కాదన్నారు. వేయి బీడీలకు 600గ్రాముల ఆకు వేయడం వల్ల 600 బీడీలు మాత్రమే అవుతున్నాయని, మిగితా 400 వందల బీడీలకు ఆకు సరిపోక తనకు వస్తున్న బట్వాడ నుంచి ఆకును కొనుకొన్ని తుట్టి నింపుతున్నారని పేర్కొన్నారు. వేయి బీడీలకు సరిపోయే నాణ్యమైన తునికాకు ఇస్తూ.. నెలకు 26 రోజుల పని ఇచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నజీద్, లక్ష్మీ, మల్లు, బాలమణి, జమున, మానస, రాణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి

బోధన్,నవంబరు9(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ఆదివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి ఏమి లేదని ఎద్దేవా చేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కాంగ్రెస్ జూబ్లీహిల్స్ అభ్యర్థిగా నిలబడ్డ నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. పలు డివిజన్లలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన వెంట బోధన్ కాంగ్రెస్ నాయకులు నాగేశ్వర్ రావు, జేపీ సార్, విద్యావికాస్ శ్రీనివాస్, కొడాలి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేస్తున్న సుదర్శన్‌రెడ్డి

మంత్రిని కలిసిన బోధన్ కాంగ్రెస్ నాయకులు



వ్యవసాయశాఖ మంత్రితో బోధన్ కాంగ్రెస్ నేతలు

బోధన్,నవంబరు9(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును ఆదివారం బోధన్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు 500రూపాయల బోనస్ ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి నాయుడు, సత్యం, శ్రీనివాస్ రావులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

దొంగల భయం.. గస్తీ దళాల ఏర్పాటు

ఆర్మూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం మచ్చర్లలో గ్రామాభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో గస్తీ దళాలను ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా వివిధ గ్రామాల్లో దొంగతనాలు జరగడంతో తమను తాము రక్షించుకునే ఉద్దేశ్యంతో గస్తీ దళాలను ఏర్పాటు చేసుకున్నారు. నిజామాబాద్‌లో చెడ్డి గ్యాంగ్ సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు రావడంతో మచ్చర్ల గ్రామస్థులు, వీడీసీ సభ్యులు దళాలను ఏర్పాటు చేసినట్లు ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ ఊషన్న తెలిపారు. దొంగల బెడద నివారణకు సుమారు 100 మందితో బృందాలను ఏర్పాటుచేసి రోజూ కొన్ని బృందాలతో రాత్రి 11 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

అమ్మా.. నీ మొక్కు తీర్చుకుంటా..!

నవీపేట,నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతంలో ఆదివారం సాయంత్రం బోనాలు నిర్వహించారు. గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన పెద్ద పోచమ్మ, భూలక్ష్మమ్మ, ఐదు చేతుల పోచమ్మ, మారెడమ్మ, నల్ల పోచమ్మ ఆలయాల్లో దేవత మూర్తులకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



మహంతంలో బోనాలు నిర్వహిస్తున్న దృశ్యం

నేడు శివాలయ వార్షికోత్సవాలు

నవీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శివ పంచాయాతన ఆలయం ప్రథమ వార్షికోత్సవాలను సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం గణపతి పూజ, పుణ్యవచనం, వాస్తుపూజ, క్షేత్రపాల నవగ్రహ మండప పూజ, అన్నపూజ, హోమం, అన్నదాన ఉంటాయన్నారు.

17న కార్తీక మాస నది స్నాన పాదయాత్ర

నవీపేట,నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయం నుంచి బాసర వరకు ఈ నెల 17న కార్తీక మాస నది స్నాన పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు శివాలయం కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ వ్యవస్థాపకుడు సిద్దేశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. నది స్నానం అనంతరం అభిషేకం, గోదావరి మాతకు 108 ముత్తయిదువులతో హారతి ఇవ్వనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

మామిడిపల్లిలో స్వచ్ఛ భారత్

ఆర్మూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధి మామిడిపల్లిలోని సేయింట్‌పాల్ హై స్కూల్‌లో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. పాఠశాల క్రీడా మైదానంలో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సుంకె శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ కేథరిన్ పాల్, కరస్పాండెంట్ ఇనాక్‌పాల్, వస్ ప్రిన్సిపాల్ ససిల్యా ఏంజిల్, సంస్థ సభ్యులు నిశాంత్, ప్రశాంత్, రాజ్‌కుమార్, రాకేష్, నరేందర్, నరేష్, రిశివర్ధన్ పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు



క్రీడలను ప్రారంభిస్తున్న బీసీ గురుకులాల జాయింట్ సెక్రటరీ తిరుపతి

క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి

- బీసీ గురుకులాల జాయింట్ సెక్రటరీ జి.తిరుపతి

జక్రాన్‌పల్లి , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, సమయస్ఫూర్తిని కల్గిస్తాయని బీసీ గురుకులాల జాయింట్ సెక్రటరీ జి.తిరుపతి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మునిపల్లి మహాత్మజ్యోతిబా పూలే గురుకుల బాలికల జూనియర్, మహిళా డిగ్రీ కళాశాలలో అండర్ -14, 19 క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో తిరుపతి మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో విద్యార్థినులు పాల్గొని ప్రతిభను కనబర్చి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో బీసీవో కే.సత్యనాథ్ రెడ్డి, బీఎల్‌వో పి.శ్రీకర్, కళాశాల ప్రిన్సిపాల్ పరుచూరి అనూష, ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వేల్పూర్ , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెలలో ఆర్మూర్ స్నేహ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మనిషి అవయవాలలో కన్నులు చాలా కీలకమైనవని కంటికి ఎలాంటి ఇబ్బంది కలిగిన వెంటనే కంటి ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని వైద్యులు గ్రామస్తులకు సూచించారు. కంటి వైద్యురాలు స్నేహ ఆధ్వర్యంలో 50 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను, అద్దాలను ఉచితంగా అందజేశారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్నేహ



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ఆర్మూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌మందిర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2008- 2009 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆర్మూర్‌లో ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు ప్రకాష్, కృష్ణస్వామి, లక్ష్మీ నర్సయ్య, రంగస్వామి, సంధ్యారాణి, సునీత, సంగీత, ప్రవీణ్, విశ్వనాథ్‌లను సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు.

బోనస్ చెల్లింపుపై హర్షం

బోధన్,నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు రైతులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చిన సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోట దుర్గమ్మ ఆలయానికి విరాళం



కోటదుర్గమ్మ ఆలయానికి ఇన్వర్టర్ అందజేసిన దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కోట దుర్గమ్మ ఆలయానికి ఆదివారం గుప్తదాత ఇన్వర్టర్‌ను అందజేశాడు. అదేవిధంగా భగవద్గీతకు సంబంధించిన సామాగ్రిని దాతలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడే జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ

బాన్సువాడటౌన్ , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మినీ స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు , బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ పోటీలను ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. క్రీడాకారులు , ఉపాధ్యాయులు , విద్యార్థులు పెద్ద సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

కొచ్చెరి మైసమ్మకు పూజలు



కొచ్చేరి మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నసురుల్లాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

నేటి నుంచి గ్రామాల వారీగా సోయా కొనుగోళ్లు

మద్నూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలో వానకాలంలో సాగు చేసిన సోయాబీన్ పంట కొనుగోలు మద్నూర్ మార్కెట్ కమిటీలో 10 నుంచి ప్రారంభమవుతుందని మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. మండల రైతులు గ్రామాల వారీగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల ఏఈవో దగ్గర టోకెన్ తీసుకొని మద్నూర్ మార్కెట్ కమిటీకి సోయాబీన్ తీసుకు రావాలని కోరారు. రైతులు సోయాబీన్ అమ్ముకొనుటకు తీసుకురావాల్సిన పత్రాలు, పట్టా పాస్ బుక్, ఆధార్ కాపీ, బ్యాంక్ అకౌంట్ కాపీ, ఏఈవో టోకెన్, రైతులు సోయాబీన్ పంట అమ్ముకొనుటకు గ్రామాల వారీగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మాత్రమే కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలని కోరారు.

ప్రభాత్ పేరి ముగింపు



భక్తులకు అన్న ప్రసాదం

మద్నూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కార్తీక మాస ప్రభాత్ పేరి కార్యక్రమం ముగియడంతో ఆదివారం శ్రీ బాలాజీ మందిరం ఆవరణలో ప్రభాత్ పేరి ముగింపు సందర్భంగా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. 35 రోజులుగా ప్రతీ ఉదయం బ్రహ్మముహూర్తంలో లేచి, గ్రామంలోని గల్లీ గల్లీ తిరుగుతూ భజనలతో ఆలయాల ప్రదర్శన చేసి భక్తి ఉత్సవాల్ నిర్వహించారు. కార్యక్రమం ముగింపురోజున సామూహిక సత్యనారాయణ పూజ నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. గ్రామంలోని పెద్దలు, యువత, మహిళలు, పిల్లలు సమష్టిగా పాల్గొని, కార్తీక ప్రభాత్ పేరిని ఆధ్యాత్మిక పర్వదినంగా మార్చారు.

సూర్యమిత్ర కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూర్యమిత్ర కోర్సుల శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.ఆర్.మనోహర్‌రెడ్డి నిరుద్యోగులైన యువతి యువకులను కోరారు. దరఖాస్తులు చేసుకున్న వారికి 90 రోజుల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని న్యూ రినవెబుల్ ఎనర్జీ వారు ఈ నెల 21 నుంచి శిక్షణ ప్రారంభిస్తారని ఎంపీడీవో తెలిపారు. 9908556640 -8333837632 నంబర్లకు కాల్ చేసి వివరాలను తెలుసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

శిఖం భూముల పరిశీలన

సిరికొండ,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సిరికొండ మండలం పెద్ద వాల్గోట్ గ్రామ పరిధిలో కబ్జాకు గురైన చెరువుల/కుంటల భూములను సీపీఐఎం నాయకులు ఆదివారం పరిశీలించారు. సీపీఐఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రతినిధి వర్గం గ్రామ పరిధిలోని పోచమ్మకుంట, లకేసుకుంట, సర్పల్లికుంట, మామిడికుంటలను సందర్శించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ పోచమ్మ కుంటలో గల సర్వేనెంబర్ 232, లకేసికుంటలోని 257 సర్వేనెంబర్‌లో గల భూమిని పెద్దరైతులు ఆక్రమించు కున్నారని ఆరోపించారు. రమేష్‌బాబు వెంట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహన్, స్థానిక నాయకులు మోహన్, గ్రామస్తులు భూమయ్య, రాజరాం, గంగారెడ్డి, సాయిలు, కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

బాన్సువాడరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో న్యాయసేవా దినోత్సవం సందర్భంగా బాన్సువాడ కోర్టు జడ్జీ టీఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో న్యాయచైతన్య సదస్సు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ అందరికీ అందుబాటులో న్యాయం అనే నినాదంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, సమాజంలో ప్రతివ్యక్తికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పేద ప్రజలు న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత ప్రభుత్వ న్యాయవాది సాయం, న్యాయ సలహాలు, అలాగే మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాములు, పంచాయితీ కార్యదర్శి గీత, పారా లీగల్ వాలంటీర్లు సంతోష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

- నష్టపోతున్న మొక్కజొన్న రైతులు
- సొమ్ము చేసుకుంటున్న దళారులు
- తాడ్వాయిలో తీరని కష్టాలు



కాళోజీవాడిలో మొక్కజొన్నల అమ్మకాలు

తాడ్వాయి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మండలంలో కొనుగోలు సెంటర్లు లేక దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మొక్కజొన్న పంట అంతంత మాత్రంగానే వచ్చిన దానికి కూడా సరైన సమయంలో ధర రాక రైతులు నష్టపోతున్నారు. తాడ్వాయి మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు. తాడ్వాయి మండలంలో ఒకే ఒక మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో మాత్రమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. బ్రాహ్మణపల్లి, కాళోజివాడి, చందాపూర్, సంగోజివాడి కరడ్ పల్లి కంకల్ దేమీకలాన్ గ్రామాల పరిధిలో మొక్కజొన్న పంట ఎక్కువగా ఉందని, మొక్కజొన్నలు రైతులు అమ్ముకోవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర 2,400 నిర్ణయిస్తే దళారులు మాత్రం ఏదో వంక కొర్రీలు పెట్టి 1700 నుంచి 1800 కొనుగోలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. అకాల వర్షాల కారణంగా మొక్కజొన్నలు నానిపోతుండడంతో రైతులు అవస్థలు పడలేక దళారులను ఆశ్రయించి మొక్కజొన్న పంటను తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సదరు అధికారులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

దిగుబడి రాలేదు



కొనుగోలు కేంద్రాలు లేక దళారులకు 1700లకే మొక్కజొన్నలను అమ్ముకోవాల్సి వచ్చింది. అధిక వర్షాలకు మొక్కజొన్న పంట దిగుబడి రాలేదు. దీనికి తోడు కొనుగోలు కేంద్రాలు లేక నష్టం ఏర్పడింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేటట్లు లేదు.

● భూమయ్య, రైతు, కాళోజీవాడి

కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి. దళారులు తక్కువ ధరకు కొంటున్నారు. పెట్టిన పెట్టుబడి రావడం 2,400 ఉన్న మొక్కలను 1700 కొంటున్నారు. కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయాలి.

● రవీందర్‌రెడ్డి, రైతు

కలిసి రాని సీజన్

- పంట సాగు దశలో చినుకు లేక తిప్పలు
- పంట చేతికి వచ్చే దశలో అకాల వర్షాలు
- ప్రతికూల వాతావరణానికి తగ్గిన పంట దిగుబడులు



అకాల వర్షానికి నానిన వరిధాన్యం

పెద్దకొడప్‌గల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలు పంటలు సాగుకు ఉపక్రమించారు. గతంలో పంట సాగు చేసే తరుణంలో సరియైన దిగుబడి రాక పంట అంతంత మాత్రంగానే పండిందని, దీంతో తమకు ఆర్థికంగా అనుకూలించలేదని నిరాశ చెందారు. అయితే ఈ సారి మాత్రం మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండి తమకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని నమ్మిన రైతన్నలు ఎంతో ఆశతో పంట సాగు చేశారు. అయితే పంట సాగుచేసే తరుణంలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఒక దశలో సాగు చేసిన పంటలు చేతికి కూడ వస్తాయో రావోనని సందేహంలో మునిగారు రైతన్నలు. ఇక రైతన్నల బాధను అర్థం చేసుకున్నాడేమ అన్నట్టు వరుణదేవుడు వానలు కురిపించడం ప్రారంభించడంతో రైతన్నలు ఎంతో సంతోషించారు. దీంతో తాము సాగుచేస్తున్న పంటలకు ఢోకా లేదని ఆనందం వ్యక్తం చేశారు. అయితే వరుణదేవుడు మాత్రం వర్షాలు కురిపించడం మానకపోయే సరికి పంటలన్నీ వర్షార్పణమయ్యాయి. పంటసాగు చేసిన మధ్య కాలం నుంచి పంట చేతికి వచ్చే సమయం వరకు వానలు తగ్గకపోవడంతో చేతికొచ్చిన పంటలన్నీ నీటమునిగాయి. ఇక అంతో ఇంత చేతికి వచ్చిన పంటను అమ్ముకుందామనుకునే తరుణంలో వ్యాపారులతో పాటు, మిల్లర్లతో ఇబ్బందులు ఎదురు కావడంతో పంటను ఎలా అమ్ముకోవాలో తెలియక కుమిలిపోతున్నాడు.

పంట సాగు దశలో వర్షాలు లేక తంటాలు...

ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలు జిల్లాలో అధిక మొత్తంలో వరితో పాటు, సోయా, పత్తి పంటలను సాగు చేశారు. వీటితో పాటుగా ఆరుతడి పంటల కింద జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము లాంటి పంటలను సాగుచేశారు. అయితే పంట సాగుచేసే దశలో ఓ మోస్తారు వర్షాలు కురియగా, ఆ తర్వాత వర్షాలు మొఖం చాటేశాయి. దీంతో రైతన్నలు వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురుచూశారు. ఇక కొన్నాళ్ల వానలు కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

అధిక వర్షాలతో పంటలకు ముప్పు.......

ప్రారంభంలో వర్షాలు లేక సతమతమవుతున్న రైతన్నలకు సెప్టెంబరు నెలలో కురిసిన వర్షాలు ఊరటనిచ్చాయి. భారీ వర్షాలతో చిన్న చిన్న కుంటలతో పాటు పెద్ద చెరువులు, ప్రాజెక్టులు నిండి అలుగులు పోశాయి. ఇక అంతటితో వర్షాలు ఆగుతాయోమోనని రైతన్నలు చూస్తుండగా సుమారుగా నెల రోజులకు పైగానే భారీవానలు పడటంతో ఆరుతడి పంటలు దెబ్బతిన్నాయి, ముఖ్యంగా పత్తి, సోయా, మొక్క జొన్న, పప్పుదినుసుల పంటలు చేతికి రాకుండాపోయాయి. అధిక వర్షాలకు సోయా కుళ్లిపోవడంతో పాటు పత్తికాయలు నేల రాలడంతో రైతుల ఆశలు కుంగిపోయాయి. ఇక గత నెలలో అనుకోకుండ వచ్చిన మొంథా తుఫాన్ దాటికి చేతికి వచ్చిన వరి పంట నీటపాలయింది. చేతికి వచ్చిన వరి ధాన్యాన్ని కోతలు చేసిన రైతులు వాటిని ఎండేందుకు రహదారులపై ఆరబెట్టగా మొంథా తుపాన్ తో వచ్చిన వర్షానికి ధాన్యం చేతికి రాకుండా పోయింది. ఇక కొన్ని ప్రాంతాలలో అయితే వరిధాన్యం వరదలకు కొట్టుకుపోయింది. దీంతో పాటు గానే వరి పూత దశలో భారీ వర్షాలు కురియడంతో పూత రాలి పోయి ధాన్యం తక్కువ దిగుబడి రావడంతో పాటు ధాన్యం రంగు మారింది.



వరి పంటను కోత కోస్తున్న హార్వేస్టర్

కిసాన్ కపాస్ యాప్‌తో ఇబ్బందులు......

పత్తిపంటను సాగుచేసిన రైతులు ఆ పంటను అమ్ముకోవాలంటే కిసాన్ కపాస్ యాప్‌లో నమోదు చేసుకుంటేనే పంట కొనుగోలు చేస్తామని సిసిఐ అధికారులు ప్రకటించడంతో రైతన్నలకు ఈ యాప్ ద్వారా కష్టాలు ఎదురవుతున్నాయి. పత్తి కొనుగోలును ఎకరాకు 7 క్వింటాళ్లకు పరిమితం చేయడంతో పంట అమ్ముకోవడంలో ఇబ్బందులు వస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో పత్తి పంటను సిసిఐ అధికారులు ఎలాంటి షరతులు లేకుండ కొనుగోలు చేశారని, ఇపుడు ఈ నిబంధనలెందుకని ప్రశ్నిస్తున్నారు.

మిల్లర్లతో వరిసాగు చేసిన రైతులకు ఇబ్బందులు......

అకాల వర్షాలతో అంతో ఇంతో వరి పంట చేతికి రావడంతో రైతన్నలు పంటను కోతలు పూర్తి చేసి కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుకు చేరిన ధాన్యం సరిగ్గా లేదంటూ మిల్లర్లు కొర్రీలు పెడుతుండడంతో రైతన్నలు అవస్థలు పడుతున్నారు. రబీసీజన్‌లో పండిన వరి ధాన్యం బాగా లేదని సంచికి కొంత తరుగు తీసే మిల్లర్లు ఈ సారి మాత్రం ఖరీఫ్‌లో పండిన వరి ధాన్యం బాగా లేదని తాము ఇటువంటి ధాన్యాన్ని తాము తీసుకోబోమని చెప్పడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఇక రైతన్నలు మిల్లర్ల దగ్గరికి వెళ్లి అంతో ఇంతో తరగు ఇస్తేనే లారీలు అన్‌లోడ్ అవుతున్నాయని తెలిపారు.

పంట నూర్పిడికి అధికంగా మారిన ఖర్చులు...

ఈ సారి ఖరీఫ్ పంట కింద సాగు చేసిన వరి, పత్తి, సోయా లాంటి పంటలను నూర్పిడి చేయడానికి గతంలో కంటే ఎక్కువ ఖర్చు అవుతుండటంతో రైతులకు తలకు మించిన భారం అవుతుందని వాపోతున్నారు. గతంలో పత్తిని సేకరిండానికి కిలో పత్తికి 10 రూపాయల లోపే చెల్లించేవారమని, ఈ సారి పత్తి దిగుబడి సరిగ్గాలేక కూలీలు రావడం లేదని. కిలో పత్తి సేకరించడానికి 10 రూపాయల పైనే చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇక అధిక వర్షాల కారణంగా సోయా ఎకరాలకు పంట నూర్పిడి కోసం 3 నుండి 4 వేల రూపాయల చెల్లిస్తే ఈ సారి 4 వేల నుండి 5 వేల రూపాలయ వరకు చెల్లించాల్సి వచ్చిందని దీంతో తమపై అధిక భారం పడిందని రైతులు తెలిపారు. ఇక వరి పంట ఎకరం కోత చేయడానికి గతంలో వైన్ మిషన్‌కు గంటకు 2500 లోపే చెల్లించామని ప్రస్తుతం గంటకు 3 వేల రూపాయలిస్తేనే మిషన్లు వస్తున్నాయని తెలిపారు. ఇలా ప్రతి పంట కోతతో పాటు నూర్పిడి చేయడంలో తమకు అధికంగా భారం పడుతుందని రైతులు వాపోతున్నారు. తమకు ఖరీఫ్‌సీజన్ సాగు అంత ఆశాజనకంగా లేదని రానున్న రబీ సీజన్ అయిన తమకు అనుకూలంగా ఉండి మంచి దిగుబడులు వస్తేనే తాము గట్టెక్కుతామని రైతన్నలు అభిప్రాయపడుతున్నారు.

తరుగు లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న దృశ్యం



నవీపేటలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి

బోధన్,నవంబరు9(ఆంధ్రజ్యోతి): తరుగు లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు నడ్పి భూమయ్య అన్నారు. ఆదివారం బోధన్ పట్టణ శివారులోని శ్రీనివాస్ క్యాంప్ గ్రామ సమీపంలో పంట చేళ్లకు వెళ్లి వరి ధాన్యాన్ని పండించిన రైతుల దగ్గర పలు సమస్యలు తెలుసుకున్నారు. తేమ 15శాతంలోపు లేకుంటే క్వింటాలుకు 4కిలోల తరుగు తీస్తున్నారని ఇట్టి విషయంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. భారీ వర్షాల ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వచ్చిన కాస్త దిగుబడిలో కూడా రకరకాల పేరుతో రైస్ మిల్లర్లు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. వరికోత కోసిన నుంచి వాతావరణం అనుకూలించగా రోజుల తరబడి ధాన్యాన్ని ఎండబెట్టి కూలీల ఖర్చు రైతులకు మరింత భారం అవుతుందన్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యంను, పచ్చి వడ్లను కొంటామని ప్రకటిస్తున్న క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదన్నారు. ఇకనైనా రైతులకు ఇబ్బందులు లేకుండా తరుగు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్న పర్వయ్య, జిల్లా నాయకులు పోశెట్టి, సూర్య విఠల్, గంగారాం, సాయిలు,పోశెట్టి, పీడీఎస్‌యూ గౌతం, బలరాం తదితరులున్నారు.

నవీపేట, : వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఆయన నవీపేటలో మాట్లాడుతూ ఈ పాటికే అకాల వర్షాలు, వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోయ్యారన్నారు. ప్రస్తుతం ఈ సీజన్‌కు సంబంధించి 60శాతం ధాన్యం కొనుగోళ్లు కూడా పూర్తికాలేదని అన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వసంత్, అవేజ్, షేక్ మహబూబ్, సావిత్రి తదితరులున్నారు.

ఎస్సీ కాలనీలో తీవ్ర నీటిఎద్దడి

● పట్టించుకోని అధికారులు

తాడ్వాయి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దళిత కాలనీలో రెండు రోజుల నుంచి తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. గతంలో భగీరథ నీటికి తోడు చిట్యాల శివారులో గల బోర్ ద్వారా కాలనీకి నీటి సరఫరా అయ్యేదని గత రెండు రోజుల క్రితం బోరు మోటారు చెడిపోవడంతో సరఫరా లేక ఇబ్బందులు పడుతూ దూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నామని ఆరోపిస్తున్నారు. కాలనీలో ఉన్న చేతి పంపునకు ఉన్న బోరు మోటర్ సైతం చెడిపోయి సంవత్సరకాలం గడిచినప్పటికీ మరమ్మతులు చేయించకపోవడంతో ఉన్న మినీ ట్యాంక్ ఖాళీగా ఉందని తెలిపారు. కొంతకాలం నుంచి కాలనీకి తాగునీటి సరఫరా సక్రమంగా కావడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చెడిపోయిన బోరు మోటార్ల మరమ్మతులు చేయించి కాలనీకి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.



ఎస్సీ కాలనీలో నీరు లేక వృధాగా ఉంటున్న మినీట్యాంక్

రేపు బాన్సువాడలో లక్ష దీపోత్సవం

బాన్సువాడటౌన్ , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయి రెడ్డి తెలిపారు. దీక్షా స్వాములు , భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కాసుల

బాన్సువాడటౌన్ , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా ఆదివారం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పలు కాలనీల్లో గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ హయాంలో జూబ్లీహిల్స్ ఎలాంటి అభివృద్ధి సాధించలేదన్నారు. అందరికీ అందుబాటులో ఉండే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సాయిలు , మన్సూర్ , రాజు , దత్తు తదితరులున్నారు.

విద్యార్థి సంఘాలు మౌనం వీడేనా..?

(5వ పేజీ తరువాయి)

పొందడం ఒకనాటకంగా జరిగేవి. అలానే కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు అక్కడే పీజీలు చేసి అక్కడే పీహెచ్‌డీలు చేసి ఇప్పుడు ఏకంగా ఉద్యోగాలు చేస్తున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థి సంఘాల నాయకులు ఉద్యోగాలు చేస్తుండగా కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు చేసిన పీహెచ్‌డీలు వివాదాస్పదమయ్యాయి. కొంతమంది తమ కుటుంబ సభ్యులను సైతం యూనివర్సిటీలో ఉద్యోగాలు ఇప్పించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

నాడు విద్యార్థులు నేడు ఉద్యోగులు

తెలంగాణ యూనివర్సిటీ స్థాపన నుంచి దాదాపు 19 ఏళ్లుగా యూనివర్సిటీనే పట్టుకుని కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు తమ పబ్బం గడుపుకుంటున్నారు. బయటకి ఉద్యమాలు చేస్తున్నట్లు ప్రచారం చేసుకుని యూనివర్సిటీ అధికారులతో కుమ్మక్కై ఉద్యమాలను పక్కదారిపట్టించి స్వప్రయోజనాలే లక్ష్యంగా తమ పనులను చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. విద్యార్థులుగా చదివిన విద్యార్థి సంఘాల నాయకులు యూనివర్సిటీలోని కొంతమంది ఉన్నతస్థానంలో ఉన్న వారితో కుమ్మక్కై ఉద్యమాలు చేస్తూ తమ పనులను మాత్రం చక్కబెట్టుకుంటున్నారు. తమ పనులు కాగానే ఉద్యమాన్ని నిలిపివేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. యూనివర్సిటీ ఏర్పాటప్పుడు విద్యార్థి సంఘాల నాయకులుగా ఉన్న కొంతమంది ఇప్పుడు కాంట్రాక్ట్, పార్ట్‌టైం అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా దొడ్డిదారిన నియామకం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు పీజీలు, పీహెచ్‌డీలు చేయడంతో పాటు తమ కుటుంబ సభ్యులను ఉద్యోగాలలో నియమించుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. కొంతమంది విద్యార్థి సంఘాల నాయకుల పీహెచ్‌డీలపై గతంలో విమర్శలు వచ్చాయి. గతంలో పనిచేసిన రిజిస్ట్రార్, వైస్ చాన్స్‌లర్‌లతో మంచిగా ఉంటూ విద్యార్థి సంఘాలను రెచ్చగొట్టి తమ స్వప్రయోజనాల కోసం ఉద్యమాలను వాడుకున్న ఎంతోమంది విద్యార్థి సంఘాల నాయకులు ఇప్పుడు యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై మాట్లాడకపోవడం విమర్శలకు తావిస్తుంది.

యూనివర్సిటీలో అంతా ముదుర్లే..

తెలంగాణ యూనివర్సిటీ అంటేనే అక్రమాలకు నిలయంగా మారింది. 2012లో దొడ్డిదారిన నియామకాలతో పాటు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా పనిచేసిన రవీందర్‌గుప్త హయాంలో జరిగిన అక్రమ నియామకాలు కూడా వివాదాస్పదమయ్యాయి. ఏకంగా వైస్ చాన్స్‌లర్‌ను అవినీతి నిరోధకశాఖకు అప్పటి ప్రభుత్వ పెద్దలే పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయంటే యూనివర్సిటీలో ఎన్ని అక్రమాలు జరిగాయో తెలుస్తోంది. యూనివర్సిటీకి ఎవరు రిజిస్ట్రార్‌గా పనిచేసిన వారి చరిత్ర అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతునే ఉంది. గతంలో పనిచేసిన రిజిస్ట్రార్‌లపై కూడా అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం గత ఐదేళ్లుగా ఏకధాటిగా పనిచేస్తున్న రిజిస్ట్రార్‌పై కూడా అనేక ఆరోపణలు ఉన్న ఉన్నతాధికారులు మాత్రం చర్యలకు వెనకాడడం అవినీతికి పరాకాష్టగా నిలుస్తోంది. యూనివర్సిటీలోని అన్ని విభాగాలలో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రతి విభాగానికి అవినీతి ఆరోపణలే ఉన్నాయి. యూనివర్సిటీ పరిధిలో ఏ కళాశాల తనిఖీకి వెళ్లినా వేలల్లో వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో విభాగాన్ని ఒక్కొక్కరు పంచుకుని అవినీతి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. యూనివర్సిటీలో ఎగ్జామినేషన్ బ్రాంచ్ ఉన్నా.. ఆ బ్రాంచ్ వ్యవహారాలన్నీ ఆడిట్ సెల్ డైరెక్టర్ కనుసన్నల్లో నడవాల్సిందే. ఆడిట్ సెల్ డైరెక్టర్ తనిఖీలకు వెళితే కళాశాలలు హడలిపోతున్నారంటే ఆ డైరెక్టర్ ఏస్థాయిలో వసూళ్లు చేస్తున్నారో అర్థమవుతోంది. తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటు ఆవశ్యకత కోసం ఉద్యమించిన విద్యార్థి సంఘాలు నేడు యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై మౌనంగా ఉండడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది.



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త



బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

సల్లంగా చూడమ్మా.. మహాలక్ష్మమ్మా

» ఘనంగా మహాలక్ష్మీ బోనాల జాతర » బోనం ఎత్తుకున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలు బాగుండాలని.. ఆయురారోగ్యాలతో పిల్లాజెల్లను, మమ్మల్ని చల్లగా చూడు తల్లి అంటూ మహాలక్ష్మమ్మకు ప్రజలు బోనాలను సమర్పించుకున్నారు. ప్రతియేటా కార్తీక మాసంలో నిర్వహించే బోనాల జాతరను ఆదివారం 19వ డివిజన్ కంఠేశ్వర్ మహాలక్ష్మి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగింది. బోనాల జాతరకు ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త హాజరై బోనాన్ని నెత్తిన పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. బోనాలకు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించి నగరంలోని పలు వీధులగుండా ఊరేగింపు చేపట్టారు. మహాలక్ష్మ్మ మాకు దీవెనలు అందించూ తల్లి అంటూ వేడుకుంటూ భక్తిశ్రద్ధలతో బోనాన్ని అందించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త మాట్లాడుతూ... తెలంగాణ సంప్రదాయంలో బోనాలకు ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా పాడిపంటలతో సంతోషంగా ఉండాలని కాంక్షిస్తూ బోనాలను సమర్పిస్తారని వివరించారు. అమ్మవారికి బోనాలను సమర్పించడం వల్ల ఎలాంటి దుష్టశక్తులు దరికి రావని ఆయురోగ్యాంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రవి, బీజేపీ నాయకులు లక్ష్మినారాయణ, సాయి ప్రవీణ్, ప్రసాద్, రవి, సాయిరాం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతిని అందజేస్తున్న త్రిమూర్తి యాజమాన్యం

విజేతకు కారు అందజేత

ఇందూరు, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ ఫర్నిచర్ దుకాణం అయిన త్రిమూర్తి ఎంటర్‌ప్రైజెస్‌లో ఆదివారం నిర్వహించిన లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతకు బంపర్ ప్రైజ్ అయిన పంచ్ కారును షోరూం యజమానులు కొండా వీరశేఖర్, శ్రావణ్, పవన్ అందజేశారు. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన సందీప్‌కుమార్ జాలు లక్కీడ్రాలో మొదటి బహుమతిని పొందారు. ఈ సందర్భంగా త్రిమూర్తి యజమానులు మాట్లాడుతూ.. తమ షోరూం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 50 రోజుల పాటు అప్ టూ 50శాతం ఆఫర్‌లతో ప్రతి రూ.5వేల కొనుగోలుపై ఒక కూపన్‌ను అందజేస్తూ బంపర్‌ప్రైజ్ కింద కారుతో పాటు 10 ఎల్‌ఈడి టీవీలు, 39 మిస్టర్ కూల్ కూలర్‌లు మొత్తం 50 బహుమతులు అందజేశామన్నారు. ఈ సందర్భంగా కారు గెలుపొందిన విజేత సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. తాను 20 ఏళ్లుగా త్రిమూర్తి రెగ్యూలర్ కస్టమర్ అని ఈ షోరూంలో నాణ్యమైన వస్తువులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్టమర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సంజయ్, మున్నూరుకాపు ప్రతినిధులు

పీసీసీ చీఫ్‌ను కలిసిన సంజయ్

ఇందూరు, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నగర తొలి మేయర్ ధర్మపురి సంజయ్ ఆధ్వర్యంలో జిల్లా మున్నూరు కాపు సంఘం కార్యవర్గంతో పాటు 16 సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిని కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లో వారిని కలిసి త్వరలో జరగబోయే సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరుకావాలని ఆహ్వానించారు. వారు సానుకూలంగా స్పందించి తప్పకుండా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వీరిని కుల పెద్దలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో పాటు, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త, రాష్ట మున్నూరు కాపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను కూడా ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఆహ్వానించినట్లు జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ధర్మపురి సంజయ్ తెలిపారు.

సాగు సందడి

(5వ పేజీ తరువాయి)

ఉండడంతో రైతులు ఆరుతడి పంట నుంచి వరిసాగుకే ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో చెరకు, శనగ, పొద్దు తిరుగుడు పంట పెద్ద మొత్తంలో ఉండగా చెరకు పూర్తిగా సాగు చేయడం తగ్గిపోయింది. శనగ, పొద్దు తిరుగుడు పంట మూడు, నాలుగు గ్రామాలకే పరిమితమైంది.

సాగుపై అవగాహన కల్పిస్తాం..



యాసంగిలో పంటల సాగులో రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక రూపొందించాం. ప్రస్తుతం వరినారు మళ్ల రైతులు సిద్ధం చేస్తుండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరుతడి పంటల సాగులో పాటించాల్సిన మెలకువలను వివరిస్తాం.

- రాజు, ఏవో, కోటగిరి

రాష్ట్రస్థాయి పోటీల్లో నిజామాబాద్ జయకేతనం



సాఫ్ట్‌బాల్ పోటీల్లో ట్రోఫీ అందుకుంటున్న జిల్లా జట్టు

ఆర్మూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):జగిత్యాలలోని గీతా విద్యాలయం క్రీడా మైదానంలో నిర్వహించిన 12వ రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళల చాంపియన్ షిప్ పోటీలలో జిల్లా జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. సెమీ ఫైనల్‌లో సిద్దిపేట జిల్లా జట్టును ఓడించిన నిజామాబాద్ క్రీడాకారులు ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టుతో తలపడగా 3-0 తేడాతో విజయం సాధించి టోర్నమెంట్ చాంపియన్ షిప్ సాధించిందని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ తెలిపారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు చేతుల మీదుగా ట్రోఫీ, పతకాలు అందుకున్నారు. జిల్లా జట్టుకు కోచ్, మేనేజర్లుగా అనికేత్, నరేష్, వినయ్, సుజాత, మౌనిక వ్యవహరించారు.

23 నుంచి ఇన్‌స్పైర్ సైన్స్‌ఫెయిర్

ఇందూరు, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకు ఇన్‌స్పైర్ సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు డీఈవో అశోక్ తెలిపారు. బోధన్‌లోని విజయ మేరీ పాఠశాలలో ప్రదర్శనలు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా తమ పాఠశాల నుంచి నిర్దేశించిన సబ్ థీమ్స్‌కి అనుగుణంగా ప్రదర్శనల్లో పాల్గొనే విద్యార్థులతో ప్రాజెక్టులు తయారుచేయాలన్నారు. 119 మంది విద్యార్థులు అవార్డుకు ఎంపికైన వారి ఖాతాలలో రూ.10వేల జమచేశామన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కెగంగాకిషన్ (9848219365)ను సంప్రదించాలన్నారు.

టీయూలో అక్రమ నియామకాలపై దర్యాప్తు జరిపించాలి

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్



మాట్లాడుతున్న రాజుగౌడ్

ఇందూరు, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విశ్వవిద్యాలయంలో జరిగీన అక్రమ నియామకాలను రద్దు చేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు నిర్ణయం తీసుకోవడం అధికారుల అవినీతికి పరాకాష్ట అని విశ్వవిద్యాలయం ప్రారంభమైన 2006 నుంచి నేటి వరకు యూనివర్సిటీలో నిత్యం ఏదో ఒక అవినీతి బయటపడుతూనే వస్తుందని దీనిపై విచారణ చేయాలని ఏఐఎఫ్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్ డిమాండ్ చేశారు. నగరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో వీసీలుగా, రిజిస్ట్రార్లుగా, ప్రొఫెసర్లుగా ఉన్నవాళ్లు యూనివర్సిటీ అభివృద్ధి గురించి కాకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. జిల్లాకు తలమానికంగా ఉన్న విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధివైపు నడపాల్సిన అధికారులు, అధ్యాపకులే అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం దురదృష్టకరమన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లాకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు యూనివర్సిటీ అభివృద్ధిపైన దృష్టి కేంద్రీకరించకపోవడం ఆలోచించాల్సిన విషయం అన్నారు. ఇందువల్లనే అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించి యూనివర్సిటీని భ్రష్టుపట్టిస్తున్న పరిస్థితి ఉందని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నియమకాలపైన సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులైన అధికారులను తక్షణం విధుల నుంచి తొలగించాలన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కొన్ని సంవత్సరాలుగా యూనివర్సిటీలో జరిగిన నిధుల దుర్వినియోగం గుర్తించి బాధ్యులైన అధికారుల నుంచి రికవరీ చేయాలని, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీగా డిమాండ్ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వరి ధాన్యాన్ని వెంటనే కొనాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రమేష్‌బాబు

ధర్పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి రైతులకు నష్టాన్ని నివారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ బాబు మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో వరి ధాన్యం కల్లాల మీద తడిసిపోయి పూర్తిగా మొలకెత్తడంతో పాటు ముక్కిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల మధ్య దళారులు, రైస్ మిల్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఐకేపీల ద్వారా కొనుగోలు చేసే ధాన్యం కూడా తరుగును క్వింటాలుకు 6 కిలోల వరకు తీస్తున్నారని, తడిసిన ధాన్యం ధరను మరింత తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల రైతులు తడిసిన వరి ధాన్యాన్ని ఎండబెడుతూ రోడ్లమీద పడి కాపులు కాస్తున్నారన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం కూడా సకాలంలో రైస్ మిల్లలకు తరలించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం వెంటనే ఎటువంటి తరుగు లేకుండా రైతులకు మద్దతు ధరను చెల్లించాలని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవైపు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రైతే రాజు అని చెబుతూ మరోవైపు రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోకపోవడం సరైనది కాదని అన్నారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నూర్జహాన్, ధర్పల్లి మండల నాయకులు మోహన్, తదితరులు పాల్గొన్నారు.



సతీష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

4వ టౌన్ ఎస్‌హెచ్‌వోగా సతీష్

సుభాష్‌నగర్, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 4వ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా సతీష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నగరంలోని 4వ టౌన్‌తో పాటు నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లను అప్‌గ్రేడ్ చేస్తూ ఆ పోలీస్ స్టేషన్‌లకు సీఐ స్థాయి అధికారిని ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ఈ మేరకు నిజామాబాద్ రూరల్, 4వ టౌన్‌లకు ఎస్‌హెచ్‌వోలను నియమిస్తూ ఐజీ ఉత్తర్వులు జారీచేశారు. 4వ టౌన్ ఎస్‌హెచ్‌వోగా నియమితులైన సతీష్ గతంలో నిజామాబాద్ నార్త్ సీఐగా, డీసీఆర్‌బీలో పనిచేశారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు 4వ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్, ఇతర సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతలే ధ్యేయంగా పనిచేస్తానని అధికారులు, ప్రజల సహకారంతో తమ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషిచేస్తానని సతీష్ తెలిపారు.



పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన లోలం పల్లె దవాఖాన

పల్లె దవాఖానకు దారేది..?

ఇందల్వాయి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లె దవాఖానల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన పల్లె దవాఖానలు అధ్వానంగా మారాయి. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల దవాఖానల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగి క్రిమికీటకాలు, విషసర్పాలు సంచరిస్తున్నాయి. ఇందల్వాయి మండలంలోని లోలం గ్రామంలో పల్లె దవాఖాన ముళ్ల పొదలతో నిండిపోయింది. గ్రామానికి చివరన దవాఖాన ఉండడంతో ఎవరు పట్టించుకోవడం లేదు. రోజూ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సైతం పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా వైద్య సిబ్బంది స్పందించి పల్లె దవాఖాన పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రుద్ర హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శంభులింగేశ్వర ఆలయంలో రుద్రహోమం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుడి జన్మనక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని శంభులింగేశ్వర ఆలయంలో ఆదివారం రుద్ర హోమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన క్రతువులో అర్చకులు దేవశర్మ, రాజులు వేదమంత్రాలు పఠించగా భక్తులు రుద్ర హోమాన్ని నిర్వహించారు. లోకకల్యాణార్థం నిర్వహించిన రుద్ర హోమంలో రుద్ర నమక చమకంతో పాటు శివుడి యొక్క అష్టోత్తర శత నామాలతో సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి రాములు, ఆలయ చైర్మన్ మధు, ధర్మకర్త మండలి ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా మహాసభ

కామారెడ్డిరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ భవన్‌లో ఈ నెల 11న నిర్వహించే కల్లు గీత కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ పిలుపునిచ్చారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణలో సైతం కల్లు గీత వృత్తిని ఆధునీకరించి జీవనోపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. మద్యం తగ్గించి స్వచ్ఛమైన కల్లును ప్రజలు అందేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



నినాదాలు చేస్తున్న పీడీఎస్‌యూ నూతన కార్యవర్గ సభ్యులు

పీడీఎస్‌యూ నగర నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ నగర నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన 23వ నగర మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతంకుమార్, రాజేశ్వర్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సాయికిరణ్, ఉపాధ్యక్షుడుగా నిఖిల్, సహాయ కార్యదర్శిగా మనోజ్, కోశాధికారిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా దత్తాద్రి, ప్రసాద్, భవాని, హర్షత్, కృష్ణ, ఈశ్వర్, నరేష్, ముక్తశ్రీ ఎన్నికయ్యారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం, శాస్త్రీయ విద్యాసాధనకై ఉద్యమిస్తామని నూతనకార్యవర్గం ప్రకటించింది.



మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పాపయ్య

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిద్దాం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి కోసం సాగిన విప్లవ ఉద్యమంలో అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమ నిర్మాణం సాగిస్తామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పాపయ్య అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని కోటగల్లిలో గల నీలంరాంచంద్రయ్య భవనంలో అమరవీరుల వర్ధంతి సభలో అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరులను స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం పెట్టుబడి దారులైన అదానీ, అంబానీలకు దేశ సంపదను కట్టబెడుతుందని ఆరోపించారు. దేశ సంపదలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న రైతులు, కార్మికులను భూములు, పరిశ్రమల నుంచి దూరం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం అదే బాటలో వెళ్తోందని.. వాటిపై ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి సాయిబాబా, నాయకులు గంగాధర్, సాయిరెడ్డి, మల్లికార్జున్, శివకుమార్, మోహన్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

సినిమా గైడ్


దేవి	: జటాధర (9.30, 1.45, 6.00, 10.15)
విజయ్	: ది గర్ల్‌ఫ్రెండ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: ప్రేమిస్తున్న (11.00, 6.00)
	: ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్ (2.00, 9.00)
లలితామహాల్	: మాస్‌జాతర (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: ఆర్యన్ (11.00), : మాస్ జాతర (1.30, 7.30)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (4.30, 10.30)
స్క్రీన్-2	: ది గ్రేట్ ప్రివెడ్డింగ్ షో (1.40, 4.30)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (7.30), : జటాధర (10.30)
స్క్రీన్-3	: ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ (ఇంగ్లీష్-3డి) (11.00)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (1.30), : జటాధర (4.20)
	: బాహుబలి ది ఎపిక్ (6.50), ది గ్రేట్ ప్రివెడ్డింగ్ షో (10.40)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ (ఇంగ్లీష్-3డి) (11.00, 6.50)
	: ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ (తెలుగు-3డి) (1.30)
	: ఆర్యన్ (4.00), : బాహుబలి ది ఎపిక్ (9.20)
స్క్రీన్-2	: జటాధర (10.50), ది గర్ల్‌ఫ్రెండ్(1.45,4.40,7.35, 10.30)
స్క్రీన్-3	: ఫోనెక్స్ అసాధ్యుడు (11.20), : కృష్ణలీల (1.55)
	: జటాదర (4.35, 7.30), : మాస్ జాతర (10.25)
స్క్రీన్-4	: డైస్ మిరాయ్ (11.05, 7.35), ది గ్రేట్ ప్రివెడ్డింగ్ షో (1.45)
	: మాస్ జాతర (4.30), : ప్రేమిస్తున్న (10.20)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,22,100	రూ.1,11,800	రూ.1580



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.90	రూ.180	రూ. 200
వెన్‌కాబ్(కిలో)	రూ.100	రూ.190	రూ. 210